క్లుప్తంగా

కరుమారి శక్తిపీఠంలో ధూమావతి హోమం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సీవీరెడ్డి ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలోని శ్రీదేవి కరుమారి అమ్మన్ శక్తిపీఠంలో శనివారం ధూమావతి హోమం చేశారు. జ్యేష్ట శుక్లపక్ష అష్టమి ధూమావతి పరదేవత ఆవిర్భావ తిథిని పురస్కరించుకుని హోమం జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో పీఠాధిపతి కరుమారి దాసు పర్యవేక్షణలో గ్రహదోషాలు, ఆర్థిక ఇబ్బందులు, నరఘోషల నుంచి ఊరట చెందడానికి ఈ హోమాన్ని నిర్వహించినట్లు కరుమారి దాసు పేర్కొన్నారు. హోమంలో పలువురు ఉభయదాతలు, భక్తులతో పాటు చాముండేశ్వరి, లక్ష్మీ నరసింహమూర్తి, శ్రావణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

1న వాహనాల వేలం

ఆటోనగర్(విజయవాడతూర్పు): స్పెషల్ ఎన్ఫోర్సుమెంట్ బ్యూరో విజయవాడ ఈస్ట్ స్టేషన్‌లో గతంలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు జూన్ 1వ తేదీన వేలంపాట నిర్వహిస్తున్నట్టు సీఐ ఎన్ నిక్సన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు స్టేషన్ ఆవరణలో నిర్వహించే వేలంలో ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనాలకు రూ.5వేలు, కార్లకు రూ.10వేలు, చొప్పున ధరావత్తు చెల్లించి పాల్గొనాలని సూచించారు. పూర్తి వివరాలకు కొరకు 9440902454, 9959841282 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు నేడు ప్రతిభా పురస్కారాలు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుకున్న 2023 ఏప్రిల్‌లో జరిగిన పదో తరగతి పరీక్షల్లో 550కు పైగా మార్కులు పొందిన విద్యార్థులకు తమ విద్యాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్నామని మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థల అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ ప్రకటనలో శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టేట్ సిలబసలో పదో తరగతి ఫలితాల్లో 550 మార్కులు, సీబీఎస్ఈ ఫలితాల్లో 450కు పైగా మార్కులు పొందిన విద్యార్థుకు ఉదయం 9 గంటలకు మొగల్రాజపురం రత్నమాంబ వీధిలోని తమ విద్యాసంస్థ ఆవరణలో ఈ పురస్కారాలను అందచేస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు ఆధార్ కార్డు, స్కూల్ ఐడీకార్డుతో పాటుగా పదో తరగతి మార్కుల జాబితా (ఇంటర్నెట్ కాపీ) తీసుకురావాలని తెలిపారు. వివరాలకు 89781 80842, 93812 61727 నెంబర్లల్లో సంప్రదించాలని ఆయన కోరారు.

వన్యప్రాణుల చట్టం కింద చంద్రబాబును అరెస్ట్ చేయాలి

ఆకుల శ్రీనివాసకుమార్

భవానీపురం(విజయవాడపశ్చిమ): వన్యప్రాణుల సంరక్షణ చట్టం సెక్షన్ 51 -1ఎ 1972 కింద చంద్రబాబును అరెస్ట్ చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శనివారం రాజమండ్రిలో నిర్వహించిన టీడీపీ మహానాడులో ఆ పార్టీ అధినేత చంద్రబాబు ఒక అభిమానితో నెమలి పింఛం దండ వేయించుకోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. దీన్ని చూస్తే రాజ్యాంగం, చట్టాలపై చంద్రబాబుకు గౌరవం లేదని స్పష్టమవుతోందని తెలిపారు.

కౌంటర్ కేసుల నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రోడ్డుపై ఇరు వర్గాలు వారు వేసుకున్న సిమెంట్ బస్తాల కోసం జరిగిన కొట్లాటపై రెండు వర్గాల ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు కౌంటర్ కేసులు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కంసాలిపేట తమ్మిన పోతరాజు స్కూల్ ప్రాంతానికి చెందిన కిలాని అప్పలనరసమ్మ, వీర్ల నాగదుర్గ కుటుంబాలకు చెందిన స్థలాల్లో ఇంటి నిర్మాణాలు చేసుకుంటున్నారు. శుక్రవారం ఆ కుటుంబాలు ఒకే సారి శ్లాబ్ వేసుకునేందుకు సామగ్రిని సిద్ధం చేసుకున్నారు. రెండు వర్గాలు రోడ్డుపై సిమెంట్ బస్తాలను పేర్చుకున్నారు. ఈ క్రమంలో సిమెంట్ బస్తాలను తీశారంటూ వారు కొట్లాకు దిగారు. రెండు వర్గాలు ఒకరిపై మరొకరు పోలీసులకు ఫిర్యాదులు చేసుకున్నారు. వారు 27 మందిపై కేసు నమోదు చేశారు.

హ్యూమన్ రైట్స్ కమిటీ కో కన్వీనర్‌గా న్యాయవాది రాజు



భవానీపురం(విజయవాడపశ్చిమ): బెజవాడ బార్ అసోసియేషన్ (బీబీఎ) మానవ హక్కుల కమిటీ కో కన్వీనర్‌గా భవానీపురం హౌసింగ్‌బోర్డ్ కాలనీకి చెందిన న్యాయవాది వీఎస్ రాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మానవులందరికి కులం, మతం, జాతి, భాష, ప్రాంతం, లింగబేధం లేకుండా కొన్ని మౌలిక హక్కులు ఉంటాయని రాజు తెలిపారు. స్వేచ్ఛగా, హుందాగా జీవించే హక్కు, బానిసత్వం, హింస నుంచి స్వేచ్ఛ, భావవ్యక్తీకరణ స్వేచ్ఛ, విద్య హక్కు వంటి మరెన్నో హక్కులు ఉన్నాయని వివరించారు. తనపై నమ్మకంతో ఈ అవకాశం ఇచ్చిన బీబీఎ ప్రెసిడెంట్ కేబీ సుందర్, జనరల్ సెక్రటరీ జున్ను శ్రీధర్, వైస్ ప్రెసిడెంట్ పుప్పాల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

వలంటీర్లు సీఎం జగన్ మానస పుత్రికలు

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



కేఎల్‌రావు పార్క్ వద్ద వలంటీర్లకు అవార్డు ప్రదానం చేస్తున్న వెలంపల్లి, భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వలంటీర్లు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రికలని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు చెప్పారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను తీసుకువచ్చి ప్రజల ముంగిటకే పాలన అందిస్తున్నారన్నారు. 46, 47, 48, 49, 50 డివిజన్ల వార్డ్ సచివాలయాల పరిధిలో సేవలు అందిస్తున్న వలంటీర్లకు శనివారం స్థానిక రూఎల్‌రావు పార్క్ వద్ద సేవ వజ్ర, సేవ రత్న, సేవ మిత్ర అవార్డుల ప్రదానం జరిగింది. అవార్డ్ గ్రహీతలకు శాలువా కప్పి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్లుగా ప్రతిభ కనబరిచిన వలంటీర్లకు వందనం కార్యక్రమం ద్వారా అవార్డులు అందిస్తున్నామని చెప్పారు.

వలంటీర్ వ్యవస్థను మెచ్చుకుంటున్నారు

గతంలో మాదిరిగా ఉద్యమాలతో పని లేకుండా ప్రజా సంక్షేమం కోసం పని చేస్తున్నామని వెలంపల్లి చెప్పారు. వలంటీర్లు అద్భుతంగా పని చేస్తున్న తీరుతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రతిపక్షాలు ఇప్పుడు వలంటీర్ వ్యవస్థను మెచ్చుకుంటున్నారని, చంద్రబాబు వలంటీర్లను అవమానించినప్పుడు వారంతా ఏం చేశారని ప్రశ్నించారు. జనసేన, వామపక్షాలు మోసినంత మాత్రాన చంద్రబాబు సీఎం కాలేదని స్పష్టం చేశారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల పక్షాన నిలిచేది సీఎం జగన్ నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఒక్కటేనని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గోదావరి గంగ, అత్తలూరి ఆదిలక్ష్మి, బోయి సత్యబాబు, పార్టీ నాయకులు రాయన నరేంద్ర, గోదావరి బాబు, కూరాకుల నాగ, బంకా విజయ, బూదాల శ్రీను, పిల్లా సూరిబాబు, త్రిమూర్తులు, టి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యాధరపురం లేబర్‌కాలనీలో

వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం విద్యాధరపురం లేబర్‌కాలనీలో గల జీఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో 38, 43, 44, 45 డివిజన్ల పరిధిలోని వార్డ్ వలంటీర్లకు సేవ వజ్ర, సేవ రత్న, సేవ మిత్ర పురస్కారాలను స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆయా డివిజన్ల కార్పొరేటర్లతో కలిసి అందచేశారు. వెలంపల్లి మాట్లాడుతూ మహానాడు వెలవెలబోతోందని, అది మహానాడు కాదని మాయనాడని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు షేక్ రెహమతున్నీసా, బాపతి కోటిరెడ్డి, మైలవరపు రత్నకుమారి, మైలవరపు మాధురి లావణ్య, దుర్గ గుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, సభ్యులు బుద్దా రాంబాబు, పార్టీ నాయకులు మైలవరపు కృష్ణ, బొమ్ము మధు, బైపినేని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మనసున్న నేత సీఎం జగన్

- ఎన్టీఆర్ అందరికీ ఆరాధ్య దైవం
- పండగలా ఇళ్ల పట్టాల పంపిణీ
- ఎన్టీఆర్ సర్కిల్ మీకు రాసిచ్చారా
- వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్



మాట్లాడుతున్న దేవినేని అవినాష్, పక్కన కడియాల బుచ్చిబాబు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ పేరు జిల్లాకు పెట్టిన మనసున్న నేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ తెలిపారు. అందరికీ ఆరాధ్య దైవమైన ఎన్టీఆర్ శతజయంతి వేడుకలను దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్టు, ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్టుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. గుణదలలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో దేవినేని అవినాష్ మాట్లాడుతూ ఎన్టీఆర్ , వైఎస్సార్ అంటే నా తండ్రి నెహ్రూకు ఎంతో అభిమానం అన్నారు. టీడీపీ నేతలు అధికారంలో ఉండగా ఎన్టీఆర్ పేరు ప్రస్తావనకు కూడా రాకుండా చేశారని ఆరోపించారు. ఎన్టీఆర్ పేరును చిరస్థాయిగా చరిత్రలో నిలిచిపోయేలా జగన్‌మోహన్‌రెడ్డి చేశారన్నారు.

టీడీపీ నేతలకు నిద్రపట్టడం లేదు

దమ్మున్న మొనగాడిలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల తరపున పోరాడి ఇళ్ల పట్టాలు ఇచ్చారన్నారు. అమరావతిలో పండుగలా జరిగిన కార్యక్రమాన్ని చూసి టీడీపీ నేతలు, ఎల్లో మీడియాకు నిద్ర పట్టడం లేదన్నారు. అధికారంలోకి వస్తే ఇళ్ల పట్టాలు రద్దు చేస్తామనడానికి టీడీపీ నేతలకు సిగ్గుందా అని ప్రశ్నించారు.

మీకు రాసిచ్చారా

పటమట ఎన్టీఆర్ సర్కిల్‌లో బ్యానర్‌లు కడుతుంటే ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్ కవ్వింపు చర్యలకు పాల్పడటం, ప్రజలను రెచ్చగొట్టాలని చూడటం దుర్మార్గం అన్నారు. మేమూ ఎన్టీఆర్ అభిమానులమే అని, బ్యానర్‌లు కట్టే హక్కు మాకు ఉందని దేవినేని అవినాష్ అన్నారు. ఎన్టీఆర్ సర్కిల్ టీడీపీకి ఎవరూ రాసివ్వలేదని, అది వాళ్ల పార్టీ ఆఫీసు కాదన్నారు. ధనబలం, ఎల్లో మీడియా ఉందని ప్రజలను రెచ్చగొట్టాలని చూడటం సరికాదని హితవు పలికారు. సమావేశంలో పార్టీ సీనియర్‌నేత కడియాల బుచ్చిబాబు కూడా పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించండి



గొల్లపూడి 1 సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్స్‌కు వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. ఆమె శనివారం జిల్లాలోని పలు హెల్త్ క్లినిక్స్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో కుటుంబ వైద్యుని ప్రోగ్రామ్, వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాల అమలును పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న సేవలు తనిఖీ చేశారు. కంటి వెలుగు కార్యక్రమంలో అవ్వా తాతలకు కంటి పరీక్షలు చేస్తున్న తీరును పరిశీలించారు. చిన్నారులకు వేస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి సక్రమంగా వేయాలని ఆదేశించారు. ఎన్‌సీడీ-సీడీ నమోదు సంఖ్యల ప్రగతిని సమీక్షించారు. ఎన్‌సీడీ-సీడీ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. ఆమె కేతవీరునిపాడు, లచ్చపాలెం, గొల్లపూడి 1 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు తనిఖీ చేశారు. డాక్టర్ పద్మావతి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ప్రసాదాల పోటు పరిశీలన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ప్రసాదాల తయారీకి నాణ్యమైన సరుకులు వినియోగించడంతో పాటు తయారీలో సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు సూచించారు. అర్జున వీధిలోని అమ్మవారి లడ్డూ, పులిహోర తయారీ పోటు ప్రసాదం తయారీకి వినియోగిస్తున్న ముడి సరుకులను రాంబాబు పరిశీలించారు. తయారైన లడ్డూ, పులిహోర ప్రసాదాలను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. వేసవి నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రసాదాల తయారీ పోటు శుభ్రంగా ఉండాలని, సిబ్బంది తలకు క్యాప్ ధరించాలని ఆదేశించారు.

పాలిటీ అండ్ గవర్నెన్స్ పుస్తకావిష్కరణ



లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని శరత్‌చంద్ర ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో రూపొందించిన పాలిటీ అండ్ గవర్నెన్స్ పుస్తకాన్ని శనివారం రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ డాక్టర్ కె.హేమచంద్రారెడ్డి ఆవిష్కరించారు. నగరంలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ సివిల్స్‌లో మంచి ర్యాంకులు సాధించేందుకు మన ప్రాంతంలోనే మంచి శిక్షణ సంస్థలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న వారు మంచి ర్యాంకులు సాధించడం అభినందనీయం అన్నారు కార్యక్రమంలో ఐఏఎస్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ తోట శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి పురుషోత్తమ భారతీస్వామి నగర యాత్ర

విజయవాడ కల్చరల్: శృంగేరి శివగంగ పీఠాధిపతులు శ్రీ పురుషోత్తమ భారతీస్వామి జూన్ 1వ తేదీ నుంచి 7 వరకు విజయయాత్రలో భాగంగా దుర్గాపురంలోని శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలో విడిదిచేస్తారని శివరామకృష్ణ క్షేత్రం ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ శారద చంద్రమౌళీశ్వర్లుకు ప్రత్యేక పూజలు, సామవేద పారాయణ, పురాణం మహేశ్వర శర్మతో శ్రీ మద్భాగవతం అంశంగా ఆధ్యాత్మిక ప్రసంగం ఉంటుందని పేర్కొన్నారు. స్వామి వారి అనుగ్రహ భాషణ జరుగుతుందని తెలిపారు.

బీసీ మహిళలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ జ్యోతి



నియామక పత్రాలు అందజేస్తున్న మొండి జ్యోతి

వించిపేట(విజయవాడపశ్చిమ): బీసీ మహిళలకు అన్ని రంగాల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ మొండి జ్యోతి ప్రభుత్వాన్ని కోరారు. ఏలూరు జిల్లా బీసీ సంక్షేమ సంఘంలో నియమితులైన మహిళలకు శనివారం చిట్టినగర్‌లోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో మొండి జ్యోతి నియామక పత్రాలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లా దినేష్, అధ్యక్షులు నివాస్, జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్ఆర్ కృష్ణబాబు, బీసీ సంక్షేమ సంఘం ఎన్టీఆర్ జిల్లా సెక్రటరీ వేముల రమణ, శివలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఈత నిషేధం

కృష్ణా తీరంలో హెచ్చరిక బోర్డులు



సీతమ్మ వారి పాదాల సమీపంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణా నది తీరం వెంబడి పలు ప్రాంతాల్లో కృష్ణలంక పోలీసులు కృష్ణానదిలో ఈత కొట్టడం నిషేధమని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇటీవల సరదాగా నదిలోకి ఈతకు వెళ్లి అనేక మంది యువకులు మృత్యువాత పడిన ఘటనలు అనేక చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ముందస్తు చర్యలో భాగంగా కృష్ణలంక పీఎస్ సీఐ ఎం.వి.దుర్గారావు ప్రజలను హెచ్చరిస్తూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. సీఐ దుర్గారావు మాట్లాడుతూ నదిలో సుడిగుండాలు ఎక్కువగా ఉన్నాయి, ఎవరూ నదిలోకి ప్రవేశించవద్దని, ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని సూచించారు. ప్రజల ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు.

30న విజయదుర్గ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమన వారి పేటలోని శ్రీ విజయదుర్గ రామలింగేశ్వర, పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని స్వామివారి కల్యాణోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, అఖండ దీపారాధన, కలశస్థాపన జరుగుతాయన్నారు. 10 గంటలకు సువర్చల సమేత శ్రీ ఆంజనేయస్వామి కల్యాణోత్సవం, సాయంత్రం శ్రీ విజయదుర్గ సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం, తీర్థప్రసాదాల వితరణ జరుగుతాయన్నారు. గుంటూరుకు చెందిన ఆగమ ప్రతిష్టాచార్య అవ్వారి ఉమా శంకర్ దీక్షిత శర్మ పర్యవేక్షణలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని దేవస్థాన కమిటీ పేర్కొంది. ఉత్సవాలు పురస్కరించుకుని మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

కృష్ణలంక(విజయవాడతూర్పు): అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఉరేసుకుని మృతి చెందిన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాణిగారితోట చలసాని నగర్‌లో నివసిస్తున్న సొందర చందు(43) క్యాటరింగ్ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య శ్రీలక్ష్మి హోటల్‌లో పనికి వెళ్తుంటుంది. చందుకు మద్యం సేవించే అలవాటు ఉంది. ఇటీవల అప్పులు పెరగడంతో భార్యకు చెప్పి బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం మద్యం సేవించే పనికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉన్నాడు. రాత్రి భోజనం చేసి నిద్రపోయారు. రాత్రి 10.30 గంటల సమయంలో శ్రీలక్ష్మి లేచి చూడగా అతను రేకుల షెడ్డు రాడ్‌కు లుంగీతో ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. స్థానికుల సాయంతో కిందకు దించి 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది అతనిని పరీక్షించి చూసి మృతి చెందినట్లు నిర్ధారించారు. అప్పుల బాధతో తన భర్త ఉరేసుకుని మృతి చెందాడని శనివారం మృతుని భార్య శ్రీలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై ఇనుపచువ్వతో దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువకుడి మెడపై ఇనుప చువ్వతో దాడి చేసి గాయపరిచిన ఘటనపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణలంకు చెందిన నక్కా నాగగోపి రాణిగారి తోటలోని కేఆర్ చికెన్ షాపులో పని చేస్తుంటాడు. శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో నాగగోపి చిట్టినగర్‌లోని రామచంద్రరావు బిర్యానీ పాయింట్‌లో చికెన్ డెలివరీ ఇచ్చి బార్‌లో మద్యం కొనుగోలు చేసి తాగేందుకు పార్కు రోడ్డులోకి వచ్చాడు. ఆ సమయంలో నాగగోపికి తెలిసిన పండు కనిపించడంలో మద్యంలోకి వాటర్ ప్యాకెట్ తీసుకురావాలని కోరాడు. దీంతో పండు కోపంతో తనకు చేతికి అందిన ఇనుప చువ్వ తీసుకుని నాగగోపి మెడపై పొడిచాడు. అతను గాయపడటంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్ నిజాయతీ



ప్రయాణికురాలు దుర్గాభవానికి పర్సును ఇస్తున్న ఆర్టీసీ ఈడీ గిడుకు వెంకటేశ్వరరావు

ఆటోనగర్(విజయవాడతూర్పు): ఆటోనగర్ ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ నిజాయతీని కనపరిచారు. శుక్రవారం అర్ధరాత్రి తిరుపతి నుంచి విజయవాడకు ఆటోనగర్ డిపోకు చెందిన బస్సులో నగరవాసి దుర్గాభవాని ప్రయాణించారు. నగరానికి రాగానే ఆమె బస్‌స్టేషన్‌లో దిగారు. ఆమె హ్యాండ్ పర్సును మర్చిపోయి బస్సు దిగారు. బస్సు ఆటోనగర్ డిపోరకు వెళ్లింది. బస్సు డ్రైవర్ రేణుకయ్య విధులను ముగించుకొని వెళ్ళేందుకు గాను బస్సును పరిశీలించారు. బస్సు వెనుక సీట్ పక్కన పర్సు కనిపించింది. ఈ పర్సును డిపో మేనేజరు ప్రవీణ్‌కుమార్‌కు ఇచ్చారు. ఈ పర్సులో రూ.7,200 నగదు, పాన్, ఆధార్‌కార్డులు, కొన్ని విలువైన డాక్యుమెంటరీలు ఉన్నట్టు చెప్పారు. డ్రైవర్ రేణుకయ్యను ఆర్టీసీ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు డిప్యూటీ ట్రాఫిక్ మేనేజరు జాన్‌సుధాకర్‌లు తదితరులు అభినందించారు. ప్రయాణీకురాలు దుర్గాభవానికి పోగొట్టుకున్న పర్సును ఇచ్చారు.

అత్తింటి వేధింపులపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహితను వేధిస్తున్న అత్తింటి వారిపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. కొత్తపేట పోతిన ఆదియ్య వీధికి చెందిన మట్టా జ్యోతికి 2021లో గుంటూరుకు చెందిన గుణపాటి సుబ్బారెడ్డికి వివాహమైంది. వివాహ సమయంలో రెండు లక్షలు కట్నం, ఇతర లాంచానాలు భారీగానే ఇచ్చారు. వివాహం అయిన కొంత కాలం తర్వాత సుబ్బారెడ్డి అసభ్యకర చిత్రాలు చూపిస్తూ భార్యను వేధిస్తున్నాడు. వాటిని భరించలేక, అదే సమయంలో తల్లికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో గత ఏడాది నవంబర్‌లో జ్యోతి పుట్టింటికి వచ్చేసింది. ఆ తర్వాత సుబ్బారెడ్డి భార్య వద్దకు వచ్చి తాళిబొట్టు ఇచ్చేయాలని బెదిరిస్తున్నాడు. కాపురానికి తీసుకువెళ్లాలంటే రూ. 2 లక్షలు అదనంగా తీసుకురావాలని డిమాండ్ చేయడమే కాకుండా చంపుతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. అతని సోదరి శ్రీలక్ష్మి కూడా అదే విధంగా వ్యవహరించడంతో అత్తింటి వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేశారు.

సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్

- అసభ్యకర వీడియోలు, ఫొటోలు
- భర్త, మరిదిపై అనుమానంతో వివాహిత ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్ తెరిచి అసభ్యకర ఫొటోలు పెడుతున్న ఘటనపై వివాహిత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తూరు తాడేపల్లికి చెందిన పందేటి పార్వతికి, 2020లో నూజివీడు మండలం వెంకట్రాదిపురానికి చెందిన నాగరాజుతో వివాహమైంది. వివాహ సమయంలో పుట్టింటి వారు ఇచ్చిన పొలం అమ్మి డబ్బులు ఇవ్వాలని నాగరాజు భార్యతో గొడవ పెట్టుకోవడంతో ఇద్దరూ విడిగా ఉంటున్నారు. దీనిపై కోర్టులో కేసు నడుస్తోంది. కొంత కాలం క్రితం నాగరాజు మరో మహిళతో వివాహానికి సిద్ధమవ్వగా పార్వతి తన పెళ్లి, విడాకుల విషయాన్ని ఆ మహిళ కుటుంబ సభ్యులకు తెలిపింది. కొద్ది రోజుల క్రితం పార్వతి పేరిట సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసి అసభ్యకరంగా మెసేజ్‌లు, వీడియోలు పెట్టారు. అవి చూసిన కొంత మంది పార్వతికి ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడటంతో ఆ అకౌంట్‌ను తన భర్త, మరిది ఆదిశేషులు క్రియేట్ చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురం తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా కనకదుర్గ ఫ్లై ఓవర్ కింద పార్క్‌లో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం లభ్యమైంది. పార్క్‌లో మృత దేహం ఉన్నట్లు వీఆర్వో వెన్నెలకు వచ్చిన సమాచారం మేరకు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గుర్తు తెలియని వ్యక్తి అనుమానస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేశారు. మృతుని వయసు 40 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉంటుంది. శరీరంపై నలుపు రంగు చారల చొక్కా, బ్లూ జీన్ ధరించి ఉన్నాడు. అతని పూర్తి వివరాలు తెలియలేదు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని బంధువులు పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై రామారావు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇంటి తాళం పగులగొట్టి బంగారు ఆభరణాలు దొంగిలించిన ఘటన భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలోని సితార సెంటర్‌లో శనివారం చోటు చేసుకుంది. సితార సెంటర్ కు చెందిన కొలిశెట్టి పుష్పవతి ఇంటికి తాళం వేసి పనికి వెళ్లింది. సాయంత్రం 6 గంటల సమయంలో ఇరుగు పొరుగు వారు ఆమెకు ఫోన్ చేసి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయని సమాచారం ఇచ్చారు. ఆమె వచ్చి చూడగా మెయిన్‌డోర్‌కు వేసిన తాళం, బీరువా తాళం తీసి ఉన్నాయి. వస్తువులు చూసుకోగా అందులో నల్ల పూసల దండ, బంగారపు చైను, ఉంగరాలు, చెవి దిద్దులు, వెండిపట్టీలు , 12వేల నగదు కనిపించలేదు. దీనిపై ఆమె భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

30తో ముగుస్తున్న వేసవి శిక్షణ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కేఎల్‌రావు స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం ఈ నెల 30వ తేదీతో ముగుస్తుందని కోచ్ రఫీ పేర్కొన్నారు. మే 2 నుంచి ప్రారంభమైన శిబిరంలో పలువురు చిన్నారులు స్విమ్మింగ్‌లో శిక్షణ పొందుతున్నారు. మంగళవారం ఉదయం శిక్షణ శిబిరం ముగింపు ఉంటుందన్నారు. శనివారం సాయంత్రం స్విమ్మింగ్‌లో శిక్షణ పొందిన చిన్నారులకు కోచ్ రఫీ పలు సూచనలు చేశారు. స్విమ్మింగ్‌లో పాటించాల్సిన నియమాలు, జాగ్రత్తలను వివరించారు. జూన్ 8వ తేదీ నుంచి రెగ్యులర్ శిక్షణ ఉంటుందని, ఆసక్తి ఉన్నవారు పాల్గొనవచ్చని తెలిపారు.

ప్రయాణికుడికి విద్యుత్ షాక్!

సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన జవాన్



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విద్యుత్ షాక్‌కు గురైన ప్రయాణికుడిని ఆర్మీజవాన్ సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడిన ఘటన శనివారం విజయవాడ రైల్వే స్టేషన్‌లో జరిగింది. తోటి ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం సుమారు 50 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి కుటుంబ సభ్యులతో కలసి గుర్తు రైలు దిగి బయటకు వెళ్లే క్రమంలో ప్లాట్‌ఫాంలోని విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురై అపస్మారక స్థితిలో పడిపోయాడు. సమీపంలోనే ఉన్న శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాలి మండలం బోరుభద్ర గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ బాలక ఈశ్వరరావు ఆ వ్యక్తికి సీపీఆర్ చేయడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. నిపై అధికారులను వివరణ అడగ్గా ఘటనపై తమకు ఎటువంటి సమాచారం రాలేదన్నారు. స్టేషన్‌లో విద్యుత్ షాక్ తగిలే పరిస్థితి లేదని, ఒక వేళ ఎండ దెబ్బతో అపస్మారక స్థితికి వెళ్ళి ఉండవచ్చని అధికారులు తెలుపుతున్నారు.